క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం



కేటీదొడ్డి: మండలంలోని సోంపురంలో గోకారి సాబ్ ఉర్సు సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు బహుమతులతో పాటు కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

‘రైతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్‌ఎస్‌ది’

గద్వాల అర్బన్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రైతులను మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్ మండిపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ కనుసన్నల్లో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణను అడ్డుకున్న రైతులపై దాడి చేశారన్నారు. ఖమ్మంలో రైతులకు బేడీలు వేసి జైలు పంపించిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఈ విషయం బీఆర్‌ఎస్ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. అలాంటిది బీఆర్‌ఎస్ నాయకులకు పంట బోనస్ గురించి మాట్లడడం విడ్డూరంగా ఉందన్నారు. అదేవిధంగా రైతులకు ఉచిత ఎరువులని మోసం చేశారని ధ్వజమెత్తారు. 5నెలల కాంగ్రెస్ అభివృద్ధి, గత పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. సమావేశంలో ఎల్లప్ప, శ్రీనివాస్ గౌడ్, తుమ్మల నర్సింహులు, ఆనంద్, పెద్దొడి రామకృష్ణ, కిష్టన్న తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు



పెద్దకొత్తపల్లి: కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు 167 జాతీయ రహదారి పనులు మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సంజీవాపూర్ నుంచి అంకిరావుపల్లి స్టేజి వరకు 40 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి పనులు వేగంగా చేస్తున్నారు. మండల కేంద్రంలోని పసుపులకు వెళ్లే గుట్ట వద్ద రోడ్డు కటింగ్ పనుల్లో నిమగ్నం అయ్యారు. రెండు నెలలో పూర్తి అయ్యే అవకాశం ఉంది.

రోడ్డుపై మురుగు



ఉండవెల్లి: మండలంలోని బొంకూరులో మురుగు కాల్వ నిర్మాణం చేశాక కంకరను తొలగించాలని కోరుతున్నారు. శుక్రవారం కాల్వ కంకరతో నిండి ఉండడంతో మురుగు రోడ్డుపై పారి దుర్వాసన వస్తుందని కాలనీవాసులు తెలిపారు. వాటిని అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

ఈర్ల నర్సింహ బాటలో పయనిద్దాం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అసమానతలు లేని నవ సమాజం కోసం తన చివరి శ్వాస వరకు ఎర్రజెండా పట్టి ఉద్యమించిన ఈర్ల నర్సింహ బాటలో పయనిద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆపార్టీ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి వర్గ సభ్యుడు ఈర్లనరసింహ ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, బి.రాము, నాయకులు నరేష్, నరసింహ్మ, చాంద్‌పాషా, సత్యనారాయణరెడ్డి, లక్ష్మన్, పవన్‌కుమార్‌రెడ్డి, దావిద్, దశరథ్, గోపాల్, రాములు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం

మరికల్: ఆత్మకూర్–మరికల్ మధ్యన బస్సుల కొరత ఉన్నందున ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదమంచున ప్రయాణం చేస్తున్నారు. నిత్యం ఈ రెండు పట్టణాల మధ్యన వనపర్తి డిపోకు చెందిన రెండు బస్సులు నడిపిస్తున్నారు. ప్రతి మూడు గంటలకు ఒకే బస్సు రావడంతో ప్రయాణికులు చేసేది లేక ఆటోలో నిలబడి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్టీసీ అధికారులు స్పందించి నారాయణపేట డిపో నుంచి కూడా అదనంగా మరో రెండు బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పన్నులు ఏమవుతున్నాయి?



జూలెకల్‌లో మురుగులో ఉన్న కొళాయి వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

- ఏటా ముక్కుపిండి రూ.లక్షల్లో ఇంటి పన్ను వసూలు
- గ్రామాల్లో కొరవడిన మౌలిక వసతులు
- ప్రజాప్రతినిధులు, అధికారులు వాడుకున్నారనే ఆరోపణలు

శాంతినగర్: గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఏటా మార్చి చివరి వరకు ఇంటి పన్ను వసూలు చేయడం అధికారుల బాధ్యతగా చేపడుతున్నారు. ఏటా వందశాతం పన్నులు వసూలు చేయాలని ఉన్నతాధికారులు చెప్పడం ఒత్తిడి పెంచడం నిరుపేదలను సైతం వేధించి పన్నులు వసూలు చేస్తున్నారు. పన్నుల వసూలే లక్ష్యంగా ఒత్తిడిలు పెంచుతున్నారేగాని ఆ నిధులు ఏమి చేస్తున్నారో పట్టించుకోని పరిస్థితులు నెలకొన్నాయి. నిధులను సర్పంచ్‌లు, కార్యదర్శులు కుమ్మక్కై స్వాహా చేస్తు మౌలిక వసతులకు మంగళం పాడుతున్నారనే ఆరోపణలు ప్రజలనుండి వెళ్లు వెత్తుతున్నాయి. దీంతో గ్రామాల్లో కనీస వసతులకు ప్రజలు నోచుకోవడంలేదని వాపోతున్నారు.

అలంపూర్ నియోజకవర్గంలో పంచాయతీలు

వడ్డేపల్లి మండలం 10, రాజోళి 11, అయిజ 28, ఉండవెల్లి 16, మానవపాడు 16, ఇటిక్యాల 29, అలంపూర్ 14 పంచాయతీలు మొత్తం 124 ఉన్నాయి.

ఇంటి పన్నుల వసూలు

నియోజకవర్గంలోని 124 పంచాయతీల్లో ఆరేళ్లలో రూ.కోట్లలో పన్నులు వసూలు చేశారు. పూరి గుడిసెలకు సైతం రూ.500 వరకు వసూలు చేశారు. పెద్ద ఇళ్లకు గజాల ప్రకారం పన్నులు వసూలు చేసుకుని జనరల్ ఫండ్‌లో డిపాజిట్ చేసి సొంత డబ్బుల్లా వాడుకున్నారని ప్రజలు పెదవి విరుస్తున్నారు. వసూలైన నిధులతో గ్రామాల్లో ఎలాంటి మౌలిక వసతులు కల్పించారో సర్పంచ్‌లు, కార్యదర్శులకే తెలియాలని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్లుగా గ్రామాల్లో వీధి దీపాలు, డ్రెయినేజీలు, కనీసం మట్టి రోడ్లకు మొరం వేయించలేని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వీధి లైట్లు వేయలేదు



ఐదేళ్లుగా మా గ్రామంలో కనీసం వీధిలైట్లు సరిగా వేయలేదు. పన్నులు మాత్రం ప్రతి సంవత్సరం వసూలు చేసుకున్నారు. గతంలో పలుమార్లు బల్బులు వేయాలని కోరినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఇటీవల ప్రత్యేకాధికారుల పాలన రావడంతో లైట్లు వేశారు. ఇంటి పన్నుల డబ్బులు దుర్వినియోగం కాకుండా ప్రజల సౌకర్యాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలి.

– రఫిక్, మారమునగాల–2, ఉండవెల్లి

డ్రెయినేజీలు నిర్మించలేదు



ఇంటి పన్నుల ద్వారా వసూలు చేసిన డబ్బులతో ఇబ్బందికరంగా ఉన్న కాలనీల్లో కనీసం డ్రెయినేజీలు నిర్మించలేదు. సీసీ రోడ్లు వేసిన కాలనీల్లో కూడా డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో రోడ్లపైనే మురుగు పారుతుంది. కనీసం కుళాయిల వద్ద డ్రెయినేజీ కాల్వ ఏర్పాటు చేయకపోవడంతో మురుగులో నిల్చుని బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నాం. పన్నుల ద్వారా వసూలైన డబ్బులతో డ్రెయినేజీలు కట్టించి ఇబ్బందులు తొలగించాలి.

– లక్ష్మిరెడ్డి, జూలెకల్, వడ్డేపల్లి మండలం

నాసిరకం విత్తనాలు కొని మోసపోవద్దు

శాంతినగర్: రైతులు వారికి కావాల్సిన విత్తనాలను లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, లూజు విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచించారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో ఎరువులు, విత్తనాల దుకాణాలను, కొంకలలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని నిల్వ వివరాలు, రసాయన మందులు, విత్తనాల స్టాకు వివరాలను పరిశీలించారు. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న, మిరప, కందుల విత్తనాలకు సంబంధించిన రశీదులను తనిఖీ చేశారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా రశీదు తీసుకోవాలని సూచించారు. అంతేగాక డీలర్లు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువకు అమ్మితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.



శాంతినగర్‌లో తనిఖీ నిర్వహిస్తున్న ఏడీఏ సక్రియానాయక్

రక్తపోటును నిర్లక్ష్యం చేయొద్దు

అలంపూర రూరల్: మండలంలోని క్యాతూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సం సందర్భంగా వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండల వైద్యాధికారి ప్రసూనరాణి మాట్లాడుతూ రక్తపోటు గురించి తెలియక చాలా మంది చిన్న వయస్సులోనే మృతి చెందుతున్నారన్నారు. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి తగిన చికిత్సతో పాటు కొంతఆరోగ్య సూత్రాలను పాటిస్తే అదుపులో పెట్టవచ్చన్నారు. మనం తినే ఆహారంలో ఉప్పు తగ్గించాలని పచ్చళ్లు, ఉప్పుతో తయారు చేసిన వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మానసిక ఒత్తిడి తగ్గించే నడక, వ్యాయామం, శారీరక శ్రమ ఉంటే శరీరం ఆధీనంలో ఉంటుందని తెలిపారు. బీపీ మాత్రలను సక్రమంగ వాడాలని తెలిపారు. రక్తపోటును నియంత్రణలో ఉంచుకోకపోతే పక్షవాతం, మూత్రపిండాలపై ఒత్తిడి పడి సరిగా రక్తాన్ని శుద్ధి చేయకపోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రామస్వామి, సీహెచ్‌ఓ లక్ష్మీకాంతం, బాలీశ్వరయ్య శెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసూనరాణి

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధనోత్సవం

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలోని బ్రహ్మంగారి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధనోత్సవాన్ని శుక్రవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడారు. సర్వమత సమ్మేళనం ధ్యేయంగా, కులమతాలకు అతీతంగా అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో వెంకటయ్యాచారి, విశ్వమోహన్, నాగరాజుచారి, వెంకటేష్ చారి, కృష్ణయ్యాచారి, సురేంద్రచారి, రమేష్, అరుణ్ కుమార్, విజయ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిటౌన్: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 331వ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో వీరబ్రహ్మం చిత్రపటానికి ఆరాధన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కలియుగంలో కుల వివక్ష నశించిపోతుందని, కులాంతర వివాహాలు జరుగుతాయని, సమాజంలో లింగ సమతా భావన పెరుగుతుందని వీరబ్రహ్మం కాలజ్ఞానం ద్వారా ప్రపంచానికి చాటి చెప్పారని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్ ప్రకాశ్ తెలియజేశారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నరసింహశర్మ, నాయకులు గంధం నాగరాజు, డాక్టర్ శ్రీనివాస రెడ్డి, కర్ణాకర్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోట బ్రహ్మంగారి ఆలయంలో ఆరాధనోత్సవంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు



వనపర్తిలో వీర బ్రహ్మేంద్ర స్వామి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ముస్తాబైన వీరబ్రహ్మేంద్రస్వాముల ఆలయం

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో వెలసిన వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 14వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం రథోత్సవం, ఆదివారం నుంచి గ్రామీణ క్రీడలు కబడ్డీ, రైతు సంబరాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు వివరించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాల సముదాయాన్ని అలంకరించారు.



వీరబ్రహ్మేంద్రస్వాముల వారి మూల విరాట్

నేడు మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్

అయిజ: జిల్లాలోని రేవులపల్లి, ధరూరు మండలాల్లో మిషన్ భగీరథకు సంబంధించిన నీటి శుద్ధికర్మాగారం శుభ్రం చేసేందుకు శనివారం అయిజ మున్సిపాలిటీ, మండలంలోని అన్ని గ్రామాలకు నీటిసరఫరా నిలిచిపోతుందని వాటర్ గ్రిడ్ ఏఈ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి తాగునీటి సరఫరాను పునర్ ప్రారంభిస్తున్నట్లు ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: చెట్ల తొలగింపు, కొత్త ఏబీ స్విచుల ఏర్పాటు, స్తంభాలు మార్చడం వలన శనివారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ శివకుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాధాకృష్ణ కాలని, పాత హౌసింగ్ బోర్డు, రైల్వేస్టేషన్, బీరెల్లి చౌరస్తా, వేణుకాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉద్యానశాఖ అధికారుల ఫోన్ నంబర్లలో మార్పు

గద్వాలవ్యవసాయం: జిల్లాలోని ఉద్యానశాఖ అధికారుల ఫోన్ నంబర్లు శుక్రవారం నుంచి మారాయని జిల్లా అధికారి ఎంఏ అక్బర్ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎంఏ అక్బర్ నంబర్ 8977714301, శ్రీనివాసాచారి గద్వాల అధికారి 8977714295, రాజశేఖర్ అలంపూర్ అధికారి 8977714296, వినీత్‌కుమార్ ఎంఐ ఇంజినీర్ 8977714298 పేర్కొన్నారు. జిల్లాలోని ఉద్యాన రైతులు ఈవిషయాన్ని గమనించాలని కోరారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

మానవపాడు: మండలంలోని గోకులపాడు, శ్రీనగర్, కొర్విపాడు, చంద్రశేఖర్‌నగర్‌లో శుక్రవారం ఎస్‌ఐ చంద్రకాంత్ వాహన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. పరిమితికి మించి వాహనాలలో ప్రయాణించరాదని సూచించారు.

రైతుబీమా చెక్కు అందజేత

గట్టు: మండలంలోని బల్గెర శుక్రవారం జెడ్పీటీసీ బాసు శ్యామల, మాజీ సర్పంచ్ హనుమంతునాయుడు రైతుబీమా చెక్కు అందజేశారు. మల్లంపల్లికి రైతు నల్లారెడ్డి మృతి చెందగా, రైతు భార్య జయమ్మకు రైతుబీమా పథకం ద్వారా 5లక్షలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో సామేలు, తిమ్మప్ప, బాసు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులను అరెస్టు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల బండమీదిపల్లిలో ఓ వైన్స్ షాపు నిర్వాహకులు చేసిన దాడిలో బలీద్‌పల్లికి చెందిన శ్రీకాంత్‌యాదవ్ మృతి చెందాడని.. అందుకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీసీ సమాజ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీకాంత్‌యాదవ్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోకుండా కాలయాపన చేయడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. ఘటనపై వెంటనే విచారణ చేపట్టాలని కోరారు.

చినుకు పడితే.. చిత్తడే!



గద్వాల - రాయచూరు ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

- ధరూరులో మడుగులను తలపిస్తున్న వర్షపునీరు
- ప్రధాన రహదారిపై రాకపోకలకు ఇక్కట్లు

ధరూరు: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మండలంలోని కోతులగిద్ద, అల్వలపాడు, మాల్‌దొడ్డి గ్రామాలతో పాటు మండల కేంద్రంలో వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గురువారం సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు భారీ వర్షం కురిసింది. తిరిగి రాత్రంతా కురిసి శుక్రవారం ఉదయం నిలిచింది. దీంతో కాలనీలన్ని జలమయమయ్యాయి. ఆయా కాలనీల్లోని అంతర్గత సీసీ రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో పాదాచారులు కాలు కదపడానికి ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్‌ల పాలన ముగియడంతో ప్రత్యేకాధికారులు వాటిపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రధాన రోడ్డుపై నిలిచిన నీరు

గురువారం సాయత్రం కురిసిన భారీ వర్షంతో గద్వాల - రాయచూరు ప్రధాన రోడ్డుపై పెద్ద ఎత్తున నీళ్లు నిలిచాయి. స్థానిక ఎరుకలి వీధి సమీపంలో భారీగా నీళ్లు నిలిచాయి. దీంతో ఇటుగా రాకపోకలు కొనసాగించే వాహనదారులు ఎక్కడ గుంత ఉందో.. ఎక్కడ చదునుగా ఉందో తెలియక ఆందోళన చెందారు. ప్రత్యేక కాల్వ ఏర్పాటు చేసి నీటిని బయటకు పంపించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు తెలిపారు. మండల కేంద్రంలోని సంత బజార్, పోస్టాఫీస్, కుర్వ వీధి, ఎస్సీ కాలనీ, ముస్లిం కాలనీల్లో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీళ్లు నిలిచిపోయాయి. పంచాయతీ సిబ్బంది, కూలీలతో ప్రత్యేక కాల్వలు ఏర్పాటు చేసి నీళ్లు నిల్వకుండా దారి మళ్లించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ధరూర్ పోస్టాఫీస్ ఎదుట నిలిచిన నీరు

గుంతలు పూడ్చాలి



ధరూరులో ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చి వర్షపు నీటిని బయటకు పంపే మార్గం చేయాలి. వర్షం కురిసిన ప్రతి సారి ఇబ్బంది పడుతున్నాం. అధికారులకు మాత్రం కనిపించడం లేదు. భారీ వాహనాలు అందులో పడిపోయే ప్రమాదం ఉంది. వెంటనే చర్యలు చేపట్టాలి.

– కుర్వ తాయన్న, ధరూరు

కాలు కదపడం కష్టమే



మా కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటితో కాలు కదపడం కష్టంగా ఉంది. ప్రధానంగా పోస్టాఫీస్ వద్ద నిలిచిన వర్షపు నీరు బురదగా మారి మరింత ఇబ్బందికి గురి చేస్తోంది. ఎవరికి చెప్పాలో తెలియడం లేదు.

– రాజు, ధరూరు

చర్యలు తీసుకుంటాం

ధరూరులో ఆయా ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి ఎక్కడెక్కడ నీళ్లు నిలిచి ఇబ్బందికరంగా మారిందో ఆ ప్రాంతాలను గుర్తించి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– వినయ్ కుమార్, ఏఈ, స్పెషలాఫీసర్ ధరూరు

కురిసిన వర్షం.. రైతన్నల హర్షం



బైరాపురంలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



అయిజ పట్టణంలోని ప్రధాన రోడ్డుపై నిలిచిన మురుగు

ఉండవెల్లి: మండల కేంద్రం, కంచుపాడు, బైరాపురం, చిన్న ఆముదాలపాడులో 14 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైనట్లు శుక్రవారం అధికారులు వెల్లడించారు. మండల కేంద్రంలో రాత్రి నుంచి తెల్లవారుజామున వరకు వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. పంట పొలాలు తడవడంతో వాగులలో కూడా నీరు చేరి పశువులకు మేత దొరకుతుందని పాడి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో విద్యుత్ మరమ్మతులు చేశారు.

అయిజ: పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో అయిజ నుంచి గట్టు, గద్వాల, తూంకుంట, కర్నూలు–రాయచూర్ రోడ్డు చౌరస్తాలకు వెళ్లే రహదారి గుంతలు పడింది. చిన్నిపాటి వర్షంపడినా గుంతల్లో వర్షంనీరు చేరుతుంది. మురుగు చేసి దుర్గంధంగా ఏర్పడి దుర్వాసన వెదజల్లుతోంది.

వాసవీమాతకు ఘనంగా పూజలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం పలువురు భక్తులు అమ్మవారికి అభిషేకం చేయించి ప్రత్యేక అలంకారంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో సామూహిక కుంకుమార్చన, అనంతరం అమ్మవారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు.

నేడు వాసవీమాత జయంతి వేడుకలు

దేవరకద్రలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవీమాత జయంతి సందర్భంగా 108 కళశాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తారని దేవస్థాన కమిటీ వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరుగుతుందని, మధ్యాహ్నం మహా మంగళ హారతి అనంతరం ప్రసాదాల పంపిణీ ఉంటుందని తెలిపారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. అవోపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు మహాగణపతిపూజతో ప్రారంభం చేశారు. ధ్వజారోహణం, సర్వతోభద్ర మండప, యోగినిమండప, నవగ్రహపూజలు చేపట్టారు. గద్వాల చంద్రశేఖర్‌రావు బృందంతో చేపట్టిన భక్తి సంగీత కార్యక్రమం ఆహుతులను ఆకట్టుకుంది. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దాచేపల్లి చంద్రయ్య, అవోపా అధ్యక్షుడు ఎలిశెట్టి మురళితో పాటు ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



దేవరకద్రలో వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు



జడ్చర్లలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

చిరుధాన్యాల సాగుతో అధిక దిగుబడి



చెంచు రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీఓ మహేష్

బల్మూర్: చిరుధాన్యాల సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ మహేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో శుక్రవారం కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని బిల్లకల్, అంబగిరి, చెంచుగూడెం, బల్మూర్ గ్రామాలకు చెందిన ఆదివాసి చెంచు గిరిజన రైతులకు ఆహార పంటల(చిరుధాన్యాల) సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ రకాల పంటల సాగువిధానం, పాటించాల్సిన మెలకువలు, ఎరువుల వాడకం అంశాలను వివరించారు. చిరుధాన్యాలకు మార్కెట్లో ఎంతో డిమాండ్ ఉందని సూచించారు. చిరుధాన్యాల సాగు వలన ఆహార భద్రత కొరవ కూడా ఉండదన్నారు. మండలంలో కోనేరు సంస్థ వారు ఆదివాసి గిరిజన రైతుల కోసం ప్రత్యేకంగా చెంచు ప్రగతి సేవా కేంద్రాలు(సీపీఎస్‌ఏకే)లను ఏర్పాటు చేసి వ్యవసాయ పనిముట్లతో పాటు ఆహార పంటల విత్తనాలు, కూరగాయల విత్తనాలను ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్లు పెద్దులయ్య, ప్రవీన్, ఏఈఓలు పవన్‌కుమార్, శివకృష్ణ, సంస్థ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.